సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 16 । అక్టోబర్ । 2024



గొంతులోకి గరళం
తాడేపల్లిగూడెంలో తాగునీటి పైపులైన్‌లకు లీకేజీల వల్ల నీటిలోకి మట్టి, బురద చేరుతుంది. నీరు రంగు మారి అప్పుడప్పుడు పురుగులు కూడా దర్శనమిస్తున్నాయి. 10లో ▸



నిలిచిన నిత్యాన్నదానం
పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నిత్యాన్నదానం నిలిపివేసినట్లు బోర్డు ఏర్పాటుచేశారు. 10లో ▸



పశు పోషణలో సంరక్షణ
పశుపోషణలో ఆరోగ్య సంరక్షణ ముఖ్యం. పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశుసంవర్ధక శాఖ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. 10లో ▸

సాయం లేక.. సాగు సాగక

- జిల్లాలో 14,135 ఎకరాల్లో సాగవ్వని ఖరీఫ్
- 2.14 లక్షల ఎకరాల నుంచి 2 లక్షల ఎకరాలకు తగ్గిన విస్తీర్ణం
- ఖాళీగా పంట పొలాలు
- 35 వేల టన్నుల వరకు తగ్గనున్న దిగుబడి



అత్తిలి మండలంలో తొలకరి సాగుకు నోచుకోని పంట పొలాలు



మొగల్తూరులో సాగు చేయని పొలాలు

సాక్షి, భీమవరం: అన్నపూర్ణగా పేరొందిన పశ్చిమ గోదావరి జిల్లాలో తొలకరి ధాన్యం సిరులు తగ్గనున్నాయి. వరుస విపత్తులు, ఆదుకునే దిశగా ప్రభుత్వం నుంచి సాయం కొరవడటంతో నష్టాల సాగు చేయలేక పొలాలను ఖాళీగా వదిలేశారు. జిల్లాలోని 2.14 లక్షల ఎకరాల ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం రెండు లక్షల ఎకరాలకు తగ్గిపోగా ఆమేరకు ధాన్యం దిగుబడి తగ్గనుంది.

పశ్చిమ డెల్టాలోని తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం, ఉండి నియోజకవర్గాల్లోని 2.14 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగవుతుంది. జిల్లా వ్యాప్తంగా 1.25 లక్షల రైతు కుటుంబాలు, వేలాది వ్యవసాయ కార్మికుల కుటుంబాలు సాగే ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుత తొలకరిలో నాట్ల దశలోనే భారీ వర్షాలు, వరదలు పంటకు నష్టం కలిగించాయి. ఆగస్టు చివరిలో కురిసిన వర్షాలకు వయ్యేరు, ఎర్రకాలువ, యనమదుర్రు, ఉప్పుటేరు ముంపుతో జిల్లా వ్యాప్తంగా 14 వేల ఎకరాల్లోని నాట్లు, 30 వేల ఎకరాలకు చెందిన నారుమడులు దెబ్బతిన్నాయి. దీంతో రెండోసారి నాట్లు, నారుమడులు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సెప్టెంబరులో గోదావరి, కొల్లేరు వరదలతో జిల్లాలోని దాదాపు 13.3 వేల ఎకరాలు మరోమారు ముంపునకు గురయ్యాయి.

కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ సాయం రూ.6000కు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.7,500 జతచేసి ఖరీఫ్ ప్రారంభానికి ముందే మొదటి విడతగా రూ.7,500, ఖరీఫ్ చివర్లో రూ.4000, రబీలో రూ.2000 సాయాన్ని రైతుల ఖాతాలకు జమచేసేది. పంట పెట్టుబడుల కోసం సన్నచిన్నకారు రైతులకు ఈ సాయం ఎంతో ఉపయోగపడేది. విపత్తుల సమయంలోను నష్టనివారణ చర్యలతో రైతులకు కొండంత అండగా నిలిచేది. ఏడాదికి రూ. 20 వేలు చొప్పున రైతులకు ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల్లో ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. మరోపక్క పంట కాలువలు, డ్రెయిన్లు పూడికతో నిండి పొలాలు ముంపు బారిన పడిడుతుండటం, ముంపు పొలాల్లో గుర్రపుడెక్క మేటలు వేయడం, పంట పెట్టుబడులు పెరిగిపోవడంతో నష్టాలకోర్చి సాగుచేయలేక కొందరు రైతులు పొలాలను ఖాళీగా వదిలేశారు. ఆయా కారణాలతో గత సీజన్‌తో పోలిస్తే జిల్లాలో 14,135 ఎకరాల ఖరీఫ్ సాగు జరుగలేదు. అధికంగా భీమవరంలో మూడు వేల ఎకరాలు, యలమంచిలి మండలంలో 1,700 ఎకరాలు, గణపవరం, పెనుగొండ మండలాల్లో దాదాపు 1,500 ఎకరాలు చొప్పున, పోడూరు, ఆచంట మండలంలో వెయ్యి ఎకరాలు చొప్పున తగ్గాయి. ధాన్యం సిరులు కురిపించే పంట పొలాలు పిచ్చిమొక్కలు, తూడుతో బీడు భూములుగా మారిపోయాయి.

తగ్గనున్న దిగుబడి

తొలకరిలో ఎకరాకు 2.5 టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. జిల్లాలోని సాధారణ సాగు విస్తీర్ణం 2.14 లక్షల ఎకరాలకు 5.35 లక్షల టన్నుల దిగుబడి రావాల్సి ఉంది. ప్రస్తుతం 14 వేల ఎకరాల్లో సాగు తగ్గడంతో 35 వేల టన్నుల వరకు దిగుబడి తగ్గనుంది.

జిల్లాలో ఖరీఫ్‌లో తగ్గిన సాగు విస్తీర్ణం

మండలం	2023 ఖరీఫ్ (ఎకరాల్లో)	2024 ఖరీఫ్ (ఎకరాల్లో)
తాడేపల్లిగూడెం	25,562	24,780
పెంటపాడు	21,285	21,252
తణుకు	11,617	11,375
ఇరగవరం	13,487	13,375
అత్తిలి	13,822	13,355
గణపవరం	11,832	10,375
ఆకివీడు	3,882	3,925
కాళ్ల	3,922	3,857
ఉండి	10,960	10,875
పాలకోడేరు	11.207	10,560
వీరవాసరం	11,650	11,562
భీమవరం	6,150	3,275
పెనుమంట్ర	12,260	11,635
పెనుగొండ	11,820	10,282
ఆచంట	10,542	9,500
పోడూరు	13,087	11,957
పాలకొల్లు	9,275	8,482
యలమంచిలి	4,945	3,215
నరసాపురం	6,127	5,992
మొగల్తూరు	832	500

న్యూస్‌రీల్

ఉండి ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి



జిల్లా అదనపు ఎస్పీ కలిసి విన్నవిస్తున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుపై కేసు నమోదు చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, బహుజన సేన రాష్ట్ర కోఆర్డినేటర్ గుంపుల సత్యకృష్ణలు డిమాండ్ చేశారు. మంగళవారం భీమవరంలో జిల్లా అడిషనల్ ఎస్పీ భీమారావును కలిసి విన్నవించారు. దళితనేతల అక్రమ అరెస్ట్ రాజ్యాంగ విరుద్ధమని అన్నారు.

పాలకొల్లులో 50 మి.మీ. వర్షపాతం

భీమవరం: బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా జిల్లా వ్యాప్తంగా గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం పాలకొల్లులో 50.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా నరసాపురంలో 32.2, యలమంచిలిలో 26.4. మొగల్తూరులో 21.2,తాడేపల్లిగూడెంలో 7.2, పెంటపాడులో 9.6, తణుకులో 23.4, అత్తిలిలో 10, గణపవరంలో 3.4, ఆకివీడులో 9.8, ఉండిలో 12.8,పాలకోడేరులో 8.4, పెనుమంట్రలో 16.6, ఇరగవరంలో 12.4, పెనుగొండలో 21.6, ఆచంటలో 16, పోడూరులో 18.4, వీరవాసరంలో 20.2, భీమవరంలో 17.4, కాళ్లలో 2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగి సరెండర్

భీమవరం (ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో డీపీఓగా(ఎన్‌హెచ్‌ఎం) పనిచేస్తున్న పి.సురేష్‌పై అవినీతి ఆరోపణల నేపథ్యంలో అతన్ని ఎన్‌హెచ్‌ఎం శాఖ ఉన్నత కార్యాలయానికి సరెండర్ చేస్తూ డీఎంహెచ్ఓ డాక్టర్ మహేశ్వరరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కేజీబీవీల్లో నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని కుక్కునూరు, వేలేరు, వేలేరుపాడుల్లో ఉన్న కస్తూర్బా బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది నియామకానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏలూరు జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. కుక్కునూరు కేజీబీవీలో అసిస్టెంట్ కుక్, స్వీపర్, స్కావెంజర్, వేలేరు కేజీబీవీలో స్వీపర్, వేలేరుపాడు కేజీబీవీలో డే వాచ్‌మెన్, స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పోస్టులను 2024–025 విద్యా సంవత్సరంలో సంవత్సర కాలానికి ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమిస్తామన్నారు. ఈ పోస్టులకు ఆసక్తి, అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు, దివ్యాంగ మహిళా అభ్యర్థులు ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా తమ దరఖాస్తులను సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

డీఎస్సీ గిరిజన అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఏలూరు(మెట్రో): ఐటీడీఏ రూఆర్ పురం పరిధిలోని ఏజెన్సీ మండలాల్లో మెగా డీఎస్సీకి సన్నద్ధమవుతున్న గిరిజన యువతకు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. బీఈడీ/డీఈడీ, టెట్ పాసై కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలలోపు ఉన్న ఆసక్తి కలిగిన గిరిజన అభ్యర్థులు ఈ నెల 21 లోపు నమోదు చేసుకోవాలన్నారు. సదరు దరఖాస్తులను 6 దశల పరిశీలన అనంతరం అర్హత పరీక్ష నిర్వహిస్తామన్నారు.

చంద్ర ప్రభపై దేవదేవుడు

వల్మీకంలో శ్రీనివాసుడి అలంకారంలో దర్శనం



చంద్రప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు



వల్మీకంలో శ్రీనివాసుడి అలంకారంలో శ్రీవారు

ద్వారకాతిరుమల: చంద్ర ప్రభపై మెరిసిన ఆ దేవదేవుడిని కళ్లారా వీక్షించిన భక్తజనులు పులకించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో జరుగుతున్న శ్రీవారి దివ్య బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రాత్రి చంద్ర ప్రభ వాహనాలపై స్వామివారు కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఉభయ దేవేరులతో శ్రీవారిని చంద్రప్రభ వాహనంపై వేంచేపు చేసి విశేష పుష్పాలంకారాలు చేశారు. పూజాదికాల అనంతరం స్వామివారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, గజ, అశ్వ సేవలు, చిరుగాలుల నడుమ చల్లనయ్య భక్తలోకానికి దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి జరగాల్సిన సూర్య ప్రభ వాహన సేవ వర్షం కారణంగా రద్దయ్యింది. ఆలయ ముఖ మండపంలో శ్రీవారు వల్మీకంలో శ్రీనివాసుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీహరి కళాతోరణ వేదికపై నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి.

బ్రహ్మోత్సవాల్లో నేడు :
- ఉదయం 7 గంటల నుంచి – హనుమద్వాహనంపై తిరువీధి సేవ
- ఉదయం 8 నుంచి – భజనలు
- ఉదయం 10 నుంచి – భక్తిరంజని
- సాయంత్రం 4 నుంచి – నాదస్వర కచేరీ
- సాయంత్రం 5 నుంచి – కూచిపూడి భరతనాట్య ప్రదర్శనలు
- రాత్రి 7 నుంచి – ఎదుర్కోలు ఉత్సవం
- రాత్రి 7 నుంచి – భరతనాట్య ప్రదర్శనలు
- రాత్రి 8.30 నుంచి – వెండి శేషవాహనంపై తిరువీధి సేవ
- ప్రత్యేక అలంకారం : వామనావతారం

మూతపడుతున్న సబ్సిడీ కౌంటర్లు



భీమవరంలో కలెక్టర్ ప్రారంభించిన కౌంటర్ మూసివేసిన దృశ్యం

భీమవరం: వంట నూనెలు, టమోటాలు, ఉల్లిపాయల ధరల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయాలకు ఏర్పాటుచేసిన దుకాణాలు మూన్నాళ్ల ముచ్చటగానే మిలిగిపోతున్నాయి. ఈ దుకాణాలు పట్టుమని వారం రోజులు గడవకముందే మూతపడుతున్నాయి. జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, నరసాపురం రైతుబజార్లతోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గ ప్రధాన కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఉల్లిపాయలు, టమాటాలతోపాటు పామాయిల్, సన్‌ఫ్లవర్ విక్రయ కేంద్రాలు ఏర్పాటుచేశారు. భీమవరం పట్టణంలోని రైల్వే ఓవర్‌బ్రిడ్జి వద్ద మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఈనెల 10న కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా కౌంటర్‌ను ప్రారంభించారు. బహిరంగమార్కెట్‌లో కంటే తక్కువ ధరకు లభిస్తాయని వినియోగదారులు ఎంతో ఆశపడ్డారు. బహిరంగ మార్కెట్‌లో టమాటా, ఉల్లిపాయల ధరలు కొంతమేరకు తగ్గినా వంట నూనెలు ధరలు ఎక్కువగానే ఉన్నాయి. అయితే రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన కౌంటర్ మూసి వేయడంతో సరుకుల కోసం వచ్చిన వినియోగదారులు తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు.

వరికి వాయుగండం

- వర్షాలు, గాలులకు వాలుతున్న విత్తన రకం వరి
- స్వర్ణ రకానికి నష్టమే



వీరవాసరం మండలం తోకలపూడిలో సుడులు తిరిగి నేలవాలుతున్న విత్తన రకం వరి పంట

భీమవరం: సార్వా సీజన్‌లో వరి రైతులపై ప్రకృతి పగబట్టింది. భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయిన రైతన్నలు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి వరి సాగుచేస్తే విత్తన రకం పంట చేతికి వచ్చే సమయంలో బంగాళాఖాతంలో వాయుగుండం రైతులను బెంబేలెత్తిస్తోంది. గత నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలు, గాలులకు మాసూళ్లకు సిద్ధమవుతున్న ఎంటీయూ 1121, ఎంటీయూ 1156, ఎంటీయూ 1153, పీఆర్ 126 రకాలు సుడులు తిరిగి నేలవాలుతున్నాయి. జిల్లాలో సుమారు 2.19 లక్షల ఎకరాలో సార్వా సాగు చేయాల్సివుండగా సీజన్ ప్రారంభంలో భారీ వర్షాల కారణంగా వేలాది ఎకరాల్లో వరినారుమళ్లు, నాట్లు నీట మునిగి రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారు. జూలైలో వర్షాల కారణంగా సుమారు 30 ఎకరాలకు సరిపడా నారుమళ్లు, 15 వేల ఎకరాల్లో నాట్లు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. తిరిగి నారుమళ్లు వేసుకుని కొంతమంది, ఇతర ప్రాంతాల్లో నారు కొనుగోలు చేసి నాట్లు వేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 2.03 లక్షల ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. మిలిగిన భూముల్లో మురుగునీరు నిలిచిపోవడంతో బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్‌లో వర్షాలు, వరదలు కారణంగా సుమారు 9 వేల ఎకరాల్లో వరిపైరు దెబ్బతిన్నట్లు అధికారులు లెక్క గట్టగా 6,312 మంది రైతులకు ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందించారు. జూన్, జూలైలో పైరు దెబ్బతిన్న రైతులకు ఇంతవరకు ప్రభుత్వం నుంచి సబ్సిడీపై విత్తనాలు సరఫరా తప్ప ఎలాంటి సాయం అందనేలేదు. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

5 వేల ఎకరాల్లో విత్తనం రకం నాట్లు

దాళ్వా పంటకు వినియోగించే విత్తనాల కోసం రైతులు సుమారు 5 వేల ఎకరాల్లో ఎంటీయూ 1121, ఎంటీయూ 1156, ఎంటీయూ 1153, పీఆర్ 126 వంటి రకాలు సాగు చేశారు. విత్తన రకాలు కొన్నిచోట్ల మాసూళ్లకు సిద్ధం కాగా మరికొన్నిచోట్ల మరో 10 రోజుల్లో కోతకు వస్తాయని రైతులు చెబుతున్నారు. స్వర్ణ రకం నాట్లు వేసిన ప్రాంతాల్లో ఈనిక పూర్తిచేసుకుని గింజలు గట్టిపడే దశలో ఉన్నాయి. ఇలాంటి తరుణంలో వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు కోతకు సిద్ధమవుతున్న విత్తన రకం, ఈనిక పూర్తి చేసుకున్న పైరు సుడులు తిరిగి నేలకు వాలిపోవడంతో విత్తన రకం మొలకలు వచ్చే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పడిపోయిన పైరుపై దోమపోటు అధికమై తీవ్ర నష్టం కలిగిస్తుందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

టౌన్ ప్లానింగ్‌లో దందా

- బడాబాబు పేరుతో భారీ వసూళ్లు
- నూతన భవనాలకు టార్గెట్ విధించి మరీ వసూళ్లు
- పక్కా నిబంధనలు పాటిస్తే ప్లాన్ తిరస్కరణ
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండికొడుతున్న నగరపాలక సంస్థ
- అందరికీ వాటాలు అందడంతో అధికారులు మౌనం



ఏలూరు వన్‌టౌన్ వేణుగోపాలస్వామి గుడి సమీపంలో నిర్మిస్తున్న జీ ప్లస్–5 అపార్ట్‌మెంట్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: నగరంలో సెట్‌బ్యాక్ లేకుండా జీ ప్లస్–4 భవనం నిర్మించుకోవచ్చు.. ఇంటికి ప్లాన్ తీసుకుని జీ ప్లస్–5 అపార్ట్‌మెంట్ కట్టుకోవచ్చు.. ఎవరినీ సంప్రదించకుండా సెల్లార్లు నిర్మించుకోవచ్చు.. ఎక్కడా నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుచెప్పరు. నిత్యం నగరంలో పర్యటించే కమిషనర్ అన్ని చూసుకుంటూ వెళ్తుంటారు కానీ అడ్డుచెప్పరు. బడాబాబు పేరుతో సచివాలయ చిరుద్యోగి నగరంలో వసూళ్ల దందా తారాస్థాయికి చేరింది. ప్రతి భవనం వద్ద వసూలు సాగిస్తుండటంతో ఉన్నతాధికారులు సైతం అవాక్కవుతున్నారు. కోట్ల రూపాయల మేర ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నా.. పట్టించుకోని పరిస్థితి. ఏలూరు నగరపాలక సంస్థలో అంతులేని అవినీతి కొనసాగుతుంది. 100 గజాల్లో నిర్మించే చిన్నపాటి నివాసం నుంచి బహుళ అంతస్తుల వరకు అన్నింటికీ రేటు కట్టి మరీ వసూలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తే 20 శాతం రిబేట్ ఇస్తారంతే.. వసూలు చేసే మామూళ్లలో ప్రజాప్రతినిధుల నుంచి ఉన్నతాధికారుల వరకు అందరికీ వాటాలు చెల్లించాలని బహిరంగంగానే చెబుతున్నారు. ఏలూరు నగరంలో 67 వేల హౌస్ అసెస్‌మెంట్స్ ఉన్నాయి. వీటి నుంచి ఏటా సగటున రూ.52 కోట్ల వరకు ఆదాయం రావాలి. 70 శాతానికి మించి పన్ను వసూలు చేయకపోవడంతో రూ.34 కోట్ల ఆదాయం సమకూరుతుంది. నీటి పన్ను ద్వారా రూ.6 కోట్లు, షాపుల ద్వారా రూ.4.8 కోట్లు, ఆసీలు, పార్కులు, ఇతర పన్నులు కలిపి మరో రూ.4.50 కోట్లు వసూలవుతుంది. ప్రభుత్వ నిధులతో కలిపి ఏటా రూ.100 కోట్ల వార్షిక బడ్జెట్ నగరపాలక సంస్థలో ప్రవేశపెడతారు. ఇక కీలకంగా ఉన్న టౌన్‌ప్లానింగ్ నుంచి వాస్తవానికి ఏడాదికి సగటున 1200 నుంచి 1500 వరకు భవన, వాణిజ్య సముదాయాలు ఉంటాయి. టౌన్‌ప్లానింగ్‌కు మాత్రం 500 నుండి 600 దరఖాస్తులు వస్తున్నాయి. 1500 దరఖాస్తులు ఏటా అందితే రూ.9 కోట్ల నుంచి రూ.10 కోట్లు ఆదాయం సమకూరుతుంది. టౌన్‌ప్లానింగ్‌లో విచ్చలవిడిగా అవినీతితో రూ. 3 కోట్ల నుంచి రూ.5 కోట్ల మధ్యే ఆదాయం సమకూరుతుంది.

టౌన్ ప్లానింగ్‌లో కింగ్ మేకర్

నగరపాలక సంస్థలో అత్యంత కీలకమైన విభాగం టౌన్ ప్లానింగ్. అసిస్టెంట్ సిటీ ప్లానర్ కింద టీపీఎస్‌లు ఉంటారు. వారి కింద 62 మంది సచివాలయాల ప్లానర్లు ఉంటారు. టౌన్ ప్లానింగ్‌లో ఏ అధికారి చక్రం తిప్పడు. ఒక్క సచివాలయ ప్లానర్ మాత్రమే చక్రం తిప్పుతాడు. నగర కమిషనర్ మొదలుకొని టీపీఓ వరకు అందరికీ అతని మాటే వేదం. వసూళ్లు, మామూళ్లు కూడా అతను నిర్ణయించేదే ఫైనల్. నిబంధనలకు అనుగుణంగా పక్కాగా ప్లాన్ టౌన్ ప్లానింగ్‌లో సబ్మిట్ చేస్తే మరుసటి రోజే తనిఖీ పేరుతో సదరు కింగ్ మేకర్ వచ్చి రకరకాల కారణాలు చెప్పి ఖర్చవుతుంది.. అధికారులతో మాట్లాడుకోమని చెప్పి వెళ్తాడు. కొన్ని గంటల తరువాత అతనే ఫోన్ చేసి ఇంత ఖర్చు అవుతుంది.. కార్పొరేషన్ ఫార్ములీ ఇస్తే ఖర్చు లేకుండా పూర్తి చేస్తామని చెబుతారు. అదేమంటే ప్రజాప్రతినిధుల నుంచి కమిషనర్ వరకు అందరికీ ప్రతి ఫైల్‌కు తప్పనిసరిగా చెల్లించాలి. చిన్న నగరంలో భారీ ఆదాయం రాదు కాబట్టి ఎక్కువ తీసుకోవాల్సి వస్తుందని బహిరంగంగానే చెబుతాడు.

మచ్చుకు కొన్ని

- ఏలూరు వన్‌టౌన్‌లో వేణుగోపాల స్వామి గుడి సమీపంలో 15 అడుగుల సందులో ఏకంగా జీ ప్లస్–5 భవనం నిర్మిస్తున్నారు. వాస్తవానికి 30 అడుగులు ఉంటేనేగాని జీప్లస్–4 అపార్ట్‌మెంట్‌కు అనుమతినివ్వరు. సదరు కింగ్‌మేకర్ సూచనతో ఇంటి ప్లాన్ సుమారు రూ.లక్షతో తీసుకుని రూ.10 లక్షలు ముడుపులు చెల్లించి అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నారు.
- ఏలూరు మధ్యలో భారీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. కనీసం సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్‌లు, ఇతర భద్రతాపరమైన చర్యలు ఏమీ లేకుండా అడ్డగోలుగా నిర్మిస్తున్నారు. సదరు కింగ్‌మేకర్ ఏసీపీ కంటే ఎక్కువ పెత్తనం చెలాయించి రూ.15 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం.
- ఏలూరు ఆర్‌ఆర్‌పేటలో చిన్న సందులో సెల్లార్ నిర్మాణానికి ఎలాంటి అనుమతి లేకుండా హడావుడి చేసేస్తున్నారు. అదే భవనంలో అదనపు ఫ్లోర్‌కు రూ.10 లక్షలు చొప్పున సదరు కింగ్‌మేకర్ బడాబాబు పేరుతో బేరం కుదుర్చుకున్నట్లు సమాచారం.

అలరించిన యోగా విన్యాసాలు



ఏలూరు ఇండోర్ స్టేడియంలో మంగళవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి యోగా ఎంపిక పోటీలు జరిగాయి. అండర్–14, 17 విభాగాల్లో పోటీకి పెద్ద ఎత్తున బాలబాలికలు పాల్గొన్నారు. 18 రకాల ఆసనాలు ప్రదర్శించారు. అండర్–14 విభాగంలో 24 మంది, అండర్– 17 విభాగంలో 24 మంది ఎంపికయ్యారు.

– ఏలూరు రూరల్

క్లుప్తంగా

పంట బోదెలో మృతదేహం

తణుకు టౌన్‌: తణుకు రూరల్‌ మండలం మండపాక గ్రామంలోని పంట బోదెలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు రూరల్‌ ఎస్సై ఏజీఎస్‌ మూర్తి తెలిపారు. మృతదేహం ఒంటిపై టీ షర్టు, షార్టు ఉందని, మృతుని వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచామని తెలిపారు. అనుమానితులు పోలీసులను సంప్రదించాలని కోరారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలకు మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

భీమవరం: అనాథ మృతదేహానికి మానవత స్వచ్ఛంద సంస్థ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. భీమవరం వన్‌టౌన్‌ పరిధిలోని కొత్త బస్టాండ్‌ సమీపంలో సోమవారం మహిళ మృతి చెందింది. ఆమె అనాథగా గుర్తించిన పోలీసులు మానవత సంస్థ దృష్టికి తీసుకువెళ్లడంతో మోక్ష ధామంలో అంత్యక్రియలు నిర్వహించినట్టు మానవత అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహనవర్మ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్‌ బుద్ధరాజు వెంకటపతిరాజు, కో చైర్మన్‌ కార్మూరి నర్సింహమూర్తి (బాబు), కోశాధికారి జీకేవీవీ ప్రసాద్‌, అల్లు శ్రీనివాస్‌, హెడ్‌ కానిస్టేబుల్‌ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బస్‌ స్టేషన్‌లో వ్యక్తి మృతదేహం



మృతదేహం

తణుకు టౌన్‌: తణుకు ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని ఎస్సై చంద్రశేఖర్‌ తెలిపారు. మంగళవారం తణుకు ఆర్టీసీ బస్‌స్టేషన్‌ రిజర్వేషన్‌ కౌంటర్‌ పక్కన సుమారు 55 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసు గల వ్యక్తి చనిపోయినట్టు తణుకు 34వ వార్డు సచివాలయం రెవెన్యూ కార్యదర్శి గంటి లక్ష్మీ వెంకట దానేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చెప్పారు. మృతుని వివరాలు తెలిసిన వారు తణుకు పట్టణ పోలీసులను సంప్రదించాలని ఎస్సై కోరారు.

వృద్ధురాలి అదృశ్యం



పచ్చా సీతారత్నం (65)

భీమడోలు: పూళ్ల గ్రామానికి చెందిన వృద్ధురాలు పచ్చా సీతారత్నం (65) రెండు రోజులుగా కనిపించడం లేదని మంగళవారం రాత్రి ఆమె భర్త భీమడోలు పోలీసులు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే పూళ్లలోని కుమ్మరికుంట వీధికి చెందిన సీతారత్నం ఈనెల 14న నుంచి కనిపించలేదని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై వై.సుధాకర్‌ తెలిపారు.

గొంతులోకి గరళం

- తాడేపల్లిగూడెంలో పైప్‌లైన్లకు లీకులు
- వృథాగా పోతున్న తాగునీరు
- రంగు మారిన, దుర్వాసన వస్తున్న వైనం
- నీటిలో నలకలు, తోకపురుగులు దర్శనం
- వ్యాధులపై ప్రజల ఆందోళన



రంగుమారిన, నురగ వస్తున్న కుళాయి నీరు



నల్లజర్ల రోడ్డులో కొండాలమ్మ గుడి వద్ద లీకేజీ



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ వీధి మూల ప్రాంతంలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం కుళాయి నీరు స్వచ్ఛమైన తాగునీరుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే పేరుంది. ప్రస్తుతం ప్రధాన, అంతర్గత పైపులైన్లకు అనేకచోట్ల లీకేజీలు ఏర్పడడంతో కుళాయి నీరు తాగాలంటే పట్టణ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తాగునీరు వృథా కావడంతోపాటు లీకేజీల ద్వారా పైపులైన్‌లోకి మట్టి, బురద చేరుతుంది. ఫలితంగా కుళాయి నీటి దుర్వాసన వస్తోంది. నీరు రంగు మారడంతో పాటు అప్పుడప్పుడు తోక పురుగులు కూడా దర్శనమిస్తున్నాయి. ఈ నీరు తాగితే తమ ఆరోగ్యం పరిస్థితి ఏంటని ప్రజలు వాపోతున్నారు. ప్రజలు వివిధ కంపెనీల వాటర్‌ కొనుక్కొని తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టాలని కోరుతున్నప్పటికీ పురపాలక సంఘం అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అతిసారం, వైరల్‌ ఫీవర్లతో ఇబ్బందులు

పైపులైన్ల లీకేజీల కారణంగా తాడేపల్లిగూడెం అనేక ప్రాంతాల్లో మంచినీరు కలుషితమౌతోంది. అతిసారం, వైరల్‌ ఫీవర్ల సంఖ్య పెరగడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏరియా ఆసుపత్రి, అర్బన్‌ హెల్త్‌ సెంటర్లు, ముఖ్యంగా ఆర్‌ఎంపీలు వద్దకు పెద్ద సంఖ్యలో వైద్యం కోసం జ్వరపీడితులు క్యూ కడుతున్నారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి, పైపులైన్‌లు లీకేజీలు అరికట్టాలని, ప్రజారోగ్య పరిరక్షణ కోసం కృషి చేయాలని బాధితులు కోరుతున్నారు.

పైప్‌లైన్‌ లీకేజీ ప్రాంతాలివే..

- వన్‌టౌన్‌లో పురపాలక సంఘ ఓవర్‌ హెడ్‌ ట్యాంక్‌ల వద్ద నుంచి వార్ఫ్‌ పరోడ్డు సమీపంలోని బౌ వంతన మీదుగా వెళుతున్న బారీ తాగునీటి పైపులైన్‌ జాయింట్ల వద్ద లీకేజీ ఏర్పడింది. అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో స్థానికులు లీకేజీ అవుతున్న పైపులైన్‌పై గోనె సంచి ఉంచి దానిపై బండరాయి పెట్టారు.



వార్ఫ్‌రోడ్డు సమీపంలోని బౌ వంతెన వద్ద ప్రధాన పైప్‌లైన్‌ లీకేజీ



ఫస్ట్‌ ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి మెట్ల ల్యాండింగ్‌ వద్ద నీరు లీకవుతున్న ప్రాంతం

- మునిసిపల్‌ కార్యాలయం సమీపంలో మెట్ల ల్యాండింగ్‌ సమీపంలోని మటన్‌, కోళ్ల సెంటర్‌ వద్ద ట్రాక్టర్లు రిపేర్‌ చేసే ప్రాంతంలో పైపులైన్‌ నుంచి నీరు లీకవుతోంది. ఈ లీకేజీ ద్వారా తాగు నీరులోకి బురద, మట్టి చేరుతుంది. మునిసిపల్‌ కార్యాలయం వద్ద సైతం పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది.
- పాతూరు శివారు ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ప్రాంతంలో చాలా కాలంగా లీకేజీలు ఉన్నాయి. వీటిని అరికట్టేందుకు జేసీబీ సాయంతో పైపులైన్‌ ప్రాంతంలో గుంతలు తీసినప్పటికీ ఫలితం ఉండటం లేదు.
- రెండో వార్డు ప్రాంతం కోతిబొమ్మ సెంటర్‌లోని చిన్న సాయిబాబా గుడి వద్ద పైప్‌లైన్‌ నుంచి ఇళ్లకు వెళ్లే పైపులు లీకవుతున్నాయి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు.
- నల్లజర్ల రోడ్డులో సీడబ్ల్యూసీ గోదాములకు ఎదురుగా కొండాలమ్మ టెంపులు వద్ద లీకేజీ ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ వీధి మూల ప్రాంతంలో డ్రెయినేజీ వద్ద లీకేజీ ఉండగా తరుచుగా ఆ ప్రాంతంలో కుళాయిలు నుంచి మురుగు నీరు వస్తోంది. ఇలా పట్టణంలో చాలా లీకేజీలు ఉన్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లీకేజీలను అరికట్టాలి



పట్టణంలో అనేక ప్రాంతాల్లో పైప్‌లైన్ల లీకేజీల కారణంగా తాగునీరు వృథాగా పోతోంది. ఆయా ప్రాంతాల్లో నీరు రంగు మారుతుంది. నలకలు, చిన్నచిన్న తోక పురుగులు నీటిలోకి చేరుతున్నాయి. నీరు దుర్వాసన వస్తోంది. కుళాయి నీరు తాగడం వల్ల అనారోగ్యాలు సంభవిస్తున్నాయి. తక్షణమే పురపాలక సంఘం అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలి. నీటి కాలుష్యం వల్ల వ్యాధులు ప్రబలకుండా ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలి.

– ముదునూరి సతీష్‌ రాజు, పాతూరు

మద్యం పాలసీతో పేదల బతుకులు ఛిద్రం

నూజివీడు: నూతన మద్యం పాలసీతో రాష్ట్ర ఖజానా నింపవచ్చేమోగాని, సామాన్య ప్రజల బతుకులు ఛిద్రమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని సీపీఐ ఎంఎల్‌ లిబరేషన్‌ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్‌ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో తుఫాన్‌ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లను మద్యం షాపుల లాటరీలో నిమగ్నమయ్యేలా చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. ప్రజల బలహీనతను సొమ్ము చేసుకొని రాష్ట్ర ఖజానాన్ని నింపాలనుకోవడం ప్రజలకు ద్రోహం చేయడమేనని వివరించారు. లాటరీలో షాపులు దక్కని ఎమ్మెల్యేలు, మంత్రులు షాపులు దక్కినవారిపై బెదిరింపులకు పాల్పడటం మొదలైందని తెలిపారు. రాష్ట్రంలో 89,882 మంది దరఖాస్తు చేసుకున్నారని ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల చొప్పున వసూలు చేయడంతో ప్రభుత్వ ఖజానాకు రూ.1798 కోట్లు చేరిందని పేర్కొన్నారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేది మద్యం అని, నేర నివేదికలు స్పష్టం చేస్తున్నప్పటికీ మద్యాన్ని ప్రోత్సహించటం సరికాదని హరినాథ్‌ విమర్శించారు. మహిళలు వేల సంఖ్యలో అదృశ్యమయ్యారని గుండెలు బాధుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌ కళ్యాణ్‌ ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. మహిళలకు 350 షాపులు కేటాయించామని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని తెలిపారు. మద్యం షాపుల విక్రయాలకు మహిళలను వాడుకోవటం బాధాకరమని వివరించారు.

నిలిచిన నిత్యాన్నదానం

- మంగళవారం అన్నదానం లేదని నోటీస్‌ బోర్డులో ప్రదర్శన
- క్షీరారామలింగేశ్వరస్వామి భక్తుల ఆవేదన



అన్నప్రసాదం నిలుపుదలపై నోటీసు బోర్డు



మంగళవారం ఖాళీగా ఉన్న నిత్యాన్నదానం షెడ్డు

పాలకొల్లు సెంట్రల్‌: రాష్ట్రంలో పంచారామక్షేత్రంలో ప్రశిద్ధిగాంచిన ఆలయం పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం. ఈ ఆలయానికి పర్వదినాల్లో ఎలాఉన్న ముఖ్యంగా కార్తీక మాసం, శివరాత్రి రోజుల్లో భక్తులు వేలాదిగా తరలి వస్తుంటారు. క్షీరపురి (పాలకొల్లు) దాతలు కొందరు కార్తీకమాసంలో భక్తులకు నెల రోజుల పాటు అన్నదానం ఏర్పాటుచేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి సుమారు పదేళ్ల కావస్తోంది. గత మూడేళ్ల క్రితం దాతల సహకారంతో ఆలయంలో నిత్యాన్నదానం ప్రారంభించారు. గత మూడేళ్లుగా నిత్యం నిత్యాన్నదానం కొనసాగుతోంది. ఐతే మంగళవారం ఆలయంలో నిత్యాన్నదానం నిలిపివేసినట్లు బోర్డు ఏర్పాటుచేశారు. దాతలు లేరని నిత్యాన్నదానం నిలిపివేసినట్టు చెబుతున్నారు. ఈ నెలలో మూడుసార్లు భోజనాలు పెట్టలేదని పలువురు చెబుతున్నారు. మంగళవారం దూరప్రాంతాల నుంచి ఆలయానికి వచ్చే భక్తులు అన్నదానం లేక నిరాశతో వెనుదిరిగారు.

ట్రస్టుగా ఏర్పడిన భక్తులు



ఆలయంలో నిత్యాన్నదానానికి కొందరు భక్తులు ఒక ట్రస్ట్‌గా ఏర్పడి సహకరిస్తున్నారు. దేవదాయ శాఖకు రూ.50 లక్షలు నిధులు సమకూర్చితే ఆలయం నుంచి నిత్యాన్నదానానికి అధికారికంగా అనుమతులు లభిస్తాయి. ప్రస్తుతం నిత్యాన్నదానం నిమిత్తం రూ.32 లక్షలు సమకూరాయి. మిగిలిన రూ.18 లక్షలు సమకూరిస్తే ఆలయం నుంచి నిత్యాన్నదానం ఏర్పాటుకు అనుమతి లభిస్తుంది.

– ముచ్చర్ల శ్రీనివాసు,
క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి, పాలకొల్లు

అధికారులు శ్రద్ధ తీసుకోవాలి



మూడేళ్ల క్రితం మా పాలకమండలి ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిత్యాన్నదానం ఏర్పాటు చేశాం. ఒక్క రోజు కూడా ఆటంకం లేకుండా ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించాం. ఈ నెలలో మూడు రోజులు ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేయలేదని భక్తులు చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నిత్యాన్నదానం అన్నప్పుడు దాతల సహకారం లేనిరోజున ఆలయ అధికారులు ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలి.

– కోరాడ శ్రీనివాసరావు,
క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్‌, పాలకొల్లు

హాస్టళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



శిశు గృహంలో రికార్డులను పరిశీలిస్తున్న రత్నప్రసాద్‌

ఏలూరు (టూటౌన్‌): ప్రభుత్వ వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్‌ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్‌, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్‌ ఆధ్వర్యంలో రత్నప్రసాద్‌ స్థానిక ఏలూరులోని శిశు గృహం, అమీనాపేటలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతోన్న వసతులపై ఆరా తీశారు. అమీనాపేటలోని వసతి గృహాల పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని సూచించా రు. సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, పరిష్కారం కాని పక్షంలో న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని అన్నా రు. విద్యార్థులు తెలిపిన పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రత్నప్రసాద్‌ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లాయర్‌ కోనే సునీత, డీసీపీఓ సూర్య చక్రవేణి, వసతి గృహాల వార్డెన్లు వెంకటేశ్వరమ్మ, రాధాదేవి, ఎస్‌ సర్వమంగళ తదితరులు పాల్గొన్నారు.

అంధులకు అండగా నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్‌ మల్లికార్జునరావు

ఏలూరు (టూటౌన్‌): అంధులకు అందరూ అండగా నిలవాలని డాక్టర్‌ మల్లికార్జున రాజు అన్నారు. స్థానిక దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్‌ – టెక్నికల్‌ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం నేతృత్వంలో జిల్లా సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ప్రపంచ వైట్‌ కేన్‌ సేఫ్టీ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డాక్టర్‌ మల్లికార్జున రాజు (డి.పి.ఎం) పాల్గొని మాట్లాడారు. ఏటా అక్టోబరు 15న వైట్‌ కేన్‌ డే నిర్వహిస్తామన్నారు. అంధులు లేదా దృష్టి లోపం ఉన్న వ్యక్తుల కోసం తెల్ల కర్రను చలన సాధనంగా గుర్తించారని వివరించారు. సంస్థ కో ఆర్డినేటర్‌ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రెసిడెంట్‌ లిండన్‌ బి.జాన్సన్‌ 1964లో వైట్‌ కేన్‌ డే ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి నేషనల్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ది బ్లైండ్‌ ప్రతి సంవత్సరం వైట్‌ కేన్‌ డే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రలో ఫిజియో థెరపీ, స్పీచ్‌ థెరపీ, కృత్రిమ అవయవాలు, యూడీఐడీ తదితర సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా పోలీసులతో గస్తీ ముమ్మరం



మహిళా పోలీస్‌ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ కె.ప్రతాప్‌ శివ కిషోర్‌

ఏలూరు (టూటౌన్‌): గుడ్‌ టచ్‌.. బ్యాడ్‌ టచ్‌లపై స్కూల్‌, కాలేజీ విద్యార్థినులకు అవగాహన కల్పించాలని ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్‌ శివ కిషోర్‌ సూచించారు. స్థానిక మహిళా పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ముందుగా మహిళా పోలీస్‌ స్టేషన్‌ ప్రాంగణం, పోలీస్‌స్టేషన్‌ భవనంలోని అన్ని గదులను పరిశీలించారు. పోలీస్‌ స్టేషన్‌ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. పోలీస్‌ స్టేషన్‌లోని సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహిళా పోలీస్‌ స్టేషన్‌ అధికారులతో మాట్లాడుతూ మహిళలను ఆకతాయిలు వేధింపులకు గురిచేసే ప్రాంతాల్లో, కాలేజీలు విడిచి పెట్టే సమయాల్లో బస్టాండ్‌, రైల్వే స్టేషన్ల వద్ద మహిళా పోలీసులతో గస్తీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీస్‌ స్టేషనుకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచు కోవాలన్నారు. కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మహిళా పోలీస్‌ స్టేషన్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎం సుబ్బారావు, ఎస్సై కాంతిప్రియ, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌ షాక్‌తో వ్యక్తి మృతి


ఉండి: ఉండి మండలం కోలమూరులో గుర్తు తెలియని వ్యక్తి ఆక్వా చెరువుపై విద్యుత్‌ షాక్‌తో మృతి చెందినట్టు తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఓ వ్యక్తి స్థానిక ఆక్వా చెరువు వద్దకు వెళ్లాడు. చెరువుగట్టుపై ఉన్న విద్యుత్‌ వైర్లు తగిలి షాక్‌కు గురై ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ వ్యక్తి వివరాలు తెలియరాలేదు. ఈ ఘటనపై తమకు సమాచారం లేదని పోలీసులు చెబుతున్నారు.

ఇసుక ట్రాక్టర్‌ సీజ్‌

జంగారెడ్డిగూడెం: ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌ చేశామని ఎస్సై షేక్‌ జబీర్‌ తెలిపారు. మండలంలోని తిరుమలాపురం బైనేరు వాగు నుంచి ఎం రవి, జె.వెంకటేశ్వరరావులు అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్టు ఆయన చెప్పారు. ట్రాక్టర్‌ను సీజ్‌ చేసి ఇద్దరిపైనా కేసు నమోదు చేశామన్నారు.

పశు పోషణలో ఆరోగ్య సంరక్షణ

- ఖనిజ లవణాల మేతలో పాడి పరిశ్రమ లాభదాయకం
- తెగుళ్ల నివారణ





శాస్త్రీయ పద్ధతిలో గేదె పాలు పితుకుతున్న రైతు, (అంతర చిత్రం) డాక్టర్‌ లింగయ్య

చింతలపూడి : పశుపోషణలో వాటి ఆరోగ్య సంరక్షణ చాలా ముఖ్యం. పశువుల ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ వహిస్తే పశువుల ఉత్పత్తి తగ్గిపోయి పాల దిగుబడి పడిపోయే ప్రమాదం ఉంది. ఆవులు సంవత్సరానికి ఒక దూడను, గేదెలు 15 నెలలకు ఒక దూడను అందించ గలిగితే పాడి పరిశ్రమ లాభదాయకంగా ఉంటుంది. అలా ఉండాలంటే పశువులకు అవసరమైన ఖనిజాలను మేత అందించాలి. వర్షాకాలం, శీతాకాలాల్లో పశువుల పెంపకంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ కె.లింగయ్య మాటల్లో..

శాస్త్రీయ, యాజమాన్య పద్ధతిలో..

పశుపోషణ చేపడితే అధిక పాల దిగుబడిని సాధించవచ్చు. రైతులు పశువుల పాకలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. పుష్టికరమైన పశువుల మేత, పరిశుభ్రమైన నీటిని ఎల్లప్పుడూ అందించాలి. దూడ పుట్టిన దగ్గర నుంచి జాగ్రత్తలు పాటించి క్రమం తప్పకుండా టీకాలు వేయిస్తే పశువులను వ్యాధుల నుంచి రక్షించిన వారమవుతాం. గోమార్లు, పిడుదులు, దోమలను నివారించాలి. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పాలు పితికే సమయంలో పశువుల ప్రవర్తనను గమనించాలి. అవి అనారోగ్యంగా కనిపిస్తే వెంటనే దగ్గరలోని పశువుల ఆసుపత్రికి తీసుకెళ్లి తగిన చికిత్స అందించాలి. ముఖ్యంగా పశువులకు అంటువ్యాధి సోకిన తరువాత చికిత్స చేయించడం వల్ల అంతగా ప్రయోజనం ఉండదు. ఒకవేళ అవి కోలుకున్నా ఉత్పాదక శక్తి తగ్గిపోతుంది. రోగాలు వచ్చాక బాధపడటం కన్నా ముందుగానే సరైన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తే పశువులకు ఎంతో మేలు. ముఖ్యంగా దూడ పుట్టిన దగ్గర నుంచి వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తే పెరుగుదల బాగుంటుంది. దూడ పెరిగి పెద్దయ్యాక చూడి కట్టి ఈనిన తరువాత పాల దిగుబడి కూడా బాగుంటుంది.

రోగ నిరోధక టీకాలు ఇలా..

గాలికుంటు వ్యాధి : పశువులకు దూడ పుట్టిన రెండు నెలలకు మొదటి సారి టీకా వేయించాలి. ఆ తరువాత సంవత్సరానికి రెండు సార్లు టీకాలు క్రమం తప్పకుండా వేయాలి. ఈ టీకాలను మార్చి, ఏప్రిల్‌, ఆగస్టు, సెప్టెంబర్‌ నెలల్లో వేయిస్తే మంచిది.

పెద్ద రోగం : ఈ వ్యాధి రాకుండా దూడకు ఆరు నెలల వయసులో మొదటి సారి టీకా వేయాలి. తరువాత జనవరి, ఫిబ్రవరి నెలల్లో సంవత్సరానికి ఒకసారి టీకా వేయించాలి.

గొంతువాపు : ఐదో నెలలో టీకా వేయించాలి. మే, జూన్‌ నెలలో ప్రతి సంవత్సరాకి ఒక సారి టీకా వేయిస్తే మంచిది.

జబ్బవాపు : ఏడో నెలలో దూడకు మొదటిసారి టీకా వేయాలి. అలాగే మే, జూన్‌ నెలల్లో సంవత్సరానికి ఒక సారి టీకా వేయించాలి.

దొమ్మ : దూడకు ఆరో నెలలో మొదటి టీకా వేయాలి. ఆగస్టు, సెప్టెంబర్‌ నెలల్లో సంవత్సరానికి ఒక సారి టీకా వేయాలి.

ఈసుడు : దూడకు నాలుగు నుంచి ఆరు నెలల్లో టీకాలు వేయించాలి. ఆ తరువాత ఈ వ్యాధి రాకుండా జీవితంలో ఒక సారి ఎప్పుడైనా టీకా వేయించవచ్చు.

థైలేరియాసిస్‌ : దూడ పుట్టిన నాలుగు నెలల తరువాత ఒక సారి, అలాగే సంవత్సరానికి ఒక సారి ఎప్పుడైనా టీకా వేయించుకోవాలి.

క్లుప్తంగా

29 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు



తణుకులో వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్స్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి 29 మంది వృద్ధులు హాజరయ్యారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు హాజరైన వృద్ధులకు వైద్యసేవలు అందించి ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి పేద వృద్ధులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సజ్జాపురం శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కార్యదర్శి కోసూరి గాంధీ, కోశాధికారి అడ్డాల కృష్ణారావు, ఉపాధ్యక్షుడు ఇవటూరి లక్ష్మణరావు, సీహెచ్ సాధు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

తణుకు టౌన్: మండలంలో భూ రీసర్వే పూరైన గ్రామాల్లో గ్రామ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ డీవీఎస్ఎస్ వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. తణుకు మండలంలో గతంలో భూ రీసర్వే పూరైన కోనాల, ముద్దాపురం, తేతలి గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 18వ తేదీన కోనాల, 22వ తేదీన తేతలి, 29న ముద్దాపురం గ్రామాల్లో గ్రామ సదస్సులను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహిస్తారని తెలిపారు. ఈ సదస్సులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నిర్వహిస్తారని తెలిపారు. ఈ గ్రామాల్లో వ్యవసాయ భూములున్న వారందరూ ఈ సదస్సులకు హాజరు కావాలని కోరారు.

కడియద్ద సుబ్బారాయుడి ఆలయానికి విరాళం



వద్ది రఘురామ్‌నాయుడును కలిసిన ఆలయ కమిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కడియద్ద గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ రూ.50వేలు విరాళాన్ని మంగళవారం అందజేశారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దారపురెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాజా మాంసాన్నే విక్రయించాలి

తాడేపల్లిగూడెం: ప్రజలకు తాజా మాంసాన్ని విక్రయించాలని, లేదంటే కఠినచర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు వ్యాపారులను హెచ్చరించారు. మంగళవారం మాంసం, కోడి మాంసం విక్రయించే వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. దుకాణాలకు డీఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్సుల ఫీజులు చెల్లించాలన్నారు. ఫ్రీజర్‌లో లేదంటే నిల్వ ఉంచిన మాంసం విక్రయిస్తే చర్యలు తీసుకుని, లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ అధికారులు, వ్యాపార సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో కూరుకుపోయిన పారిశుద్ధ్య వాహనం



డ్రెయిన్‌లో కూరుకుపోయిన పారిశుద్ధ్య వాహనం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఓవర్ బ్రిడ్జి వద్ద మునిసిపల్ కార్యాలయం వైపు నుంచి మసీద్ సెంటర్ మలుపు తిప్పుతున్న క్రమంలో పురపాలక సంఘానికి చెందిన స్వచ్ఛ ఆంధ్రమిషన్ కంపాక్టర్ (పారిశుద్ధ్య వాహనం) మంగళవారం సాయంత్రం వెనుక టైర్లు డ్రెయిన్‌లో కూరుకుపోయాయి. ఈ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలకు కొద్ది దూరంలో వాహనం నిలిచిపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ మలుపు వద్ద ఉన్న డ్రెయిన్‌కు గతంలో స్థానికుల సహకారంతో ఇనుప రాడ్‌లు ఏర్పాటు చేసి మెస్ ఏర్పాటు చేశారు. ఇటీవల అక్కడి ఇనుప మెస్‌ను డ్రెయినేజీలోని పూడిక తీసే సమయంలో తొలగించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇనుప మెస్ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని స్థానికులు వాపోతున్నారు. వర్షాకాలం సమయంలో నిండుగా నీటితో మునిగి ఉండటంతో మలుపు వద్ద డ్రెయిన్‌ను గుర్తించని వాహనదారులు ప్రమాదానికి గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే మలుపువద్ద డ్రెయిన్‌కు రక్షణ ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

మురుగు సాగదు.. ముంపు తప్పదు

- అసంపూర్తి పనులతో నిత్యం అవస్థలు
- మురుగునీటిలోనే సంజయ్ గాంధీ నగర్‌వాసులు
- వర్షాకాలం ప్రారంభం నుంచి దుర్గంధం, దుర్వాసనల మధ్యే జీవనం
- జ్వరాలతో మంచాలు పడుతున్న వైనం



తణుకు సంజయ్‌గాంధీ నగర్‌లోని రోడ్డుపై మురుగునీటిలో నడుస్తున్న మహిళ



తణుకు సంజయ్‌గాంధీ నగర్‌లో ఇంటిబయట కాలుపెట్టలేని దుస్థితి



తణుకు సంజయ్ గాంధీ నగర్‌లో మురుగునీటితో నిండిపోయిన డ్రెయిన్ వద్దే కూర్చున్న మహిళలు

తణుకు అర్బన్: తణుకు పట్టణంలో డ్రెయిన్ల అసంపూర్తి నిర్మాణాలతో మురుగు పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. 34వ వార్డులో పరిశీలిస్తే పలు ప్రాంతాల్లో డ్రెయిన్ కంటే రహదారులు పల్లంగా ఉంటాయి. కొన్ని చోట్ల డ్రెయిన్‌కు, పొంతన లేకుండా పనులు చేశారు. దీంతో రూ.లక్షల వ్యయంతో డ్రెయిన్లు నిర్మించినా మురుగు, ముంపు సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. వర్షాలు తగ్గినా కానీ మురుగునీటిలోనే నివసించాల్సిన దుస్థితిలో తణుకు 34వ వార్డు సంజయ్‌గాంధీ నగర్ ప్రాంతం ఉంది. తణుకు జాతీయ రహదారి సమీపంలోని గౌతమీ సాల్వెంట్ గోడను ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో రోడ్డు పల్లమైపోయి, డ్రెయినేజీలు మురుగునీరు ప్రవహించకపోవడంతో రోడ్డుపైనే మురుగునీరు నిలిచిపోయి ఆ నీటిలోనే రాకపోకలు సాగించాల్సి వస్తుందంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాకాలం ప్రారంభైన నాటి నుంచి ఈ మురుగునీటిలోనే నివసిస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్య చెప్పుకున్నా కానీ పరిష్కారం దొరకడంలేదని వాపోతున్నారు. ఈ మురుగునీటిలో నివసిస్తూ దోమల కాటుకు జ్వరాల పాలైపోయి లంకణాలు చేయలేకపోతున్నామంటూ గగ్గోలుపెడుతున్నారు. జ్వరాలబారిన పడి వేలాదిరూపాయిలు ఆస్పత్రుల్లో కట్టి బయటపడాల్సి వస్తుందంటూ రోదిస్తున్నారు.

వీధిలో 40 ఇళ్లు

తణుకు జాతీయ రహదారి సమీపంలోని గౌతమి సాల్వెంట్‌ను ఆనుకుని ఉన్న ఈ సంజయ్‌గాంధీ నగర్ రోడ్డులో 40 ఇళ్లు ఉండగా సుమారుగా 300లకుపైగా జనాభా నివసిస్తున్నారు. ఒక మాదిరి వర్షం వచ్చి వెలిసిపోయానా రోజులతరబడి రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండిపోయే పరిస్థితి. ఈ రోడ్డులోని ప్రజానీకం తమ ఇళ్లలో స్నానాలు, ఇతర అవసరాలకు వినియోగించిన నీరు డ్రెయినేజీల నుంచి రోడ్డుపైకి చేరి అదే నీరు రోజులతరబడి నిల్వ ఉండి మురుగునీరుగా మారి ఆ నీటిలోనే నడుస్తూ ఇళ్లలోకి చేరాల్సి వస్తున్న దుస్థితి. దినదినాభివృద్ధి చెందిన తణుకు ప్రాంతంలో కూడా మురుగునీటిలోనే నివసించే దుస్థితి వచ్చిందంటే ఏమనుకోవాలంటూ స్థానికులు విరుచుకుపడుతున్నారు. కనీసం మునిసిపల్ సిబ్బంది డ్రెయినేజీలు శుభ్రం చేయడంలేదని, బ్లీచింగ్ పౌడర్ కూడా చిమ్మడంలేదని నివాసితులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ రహదారి అభివృద్ధి కోసం సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై టెండరు ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు ప్రారంభించడంలేదంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

పంట నష్ట పరిహారం వెంటనే చెల్లించాలి

తణుకు టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం అందజేయాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులను రైతులు కోరారు. మంగళవారం తణుకు రూరల్ మండలం ముద్దాపురం రైతు సేవా కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన రైతులకు ఇప్పటివరకూ నష్ట పరిహారం అందలేదంటూ రైతులు అధికారులను ప్రశ్నించారు. ఈసందర్భంగా జిల్లా వ్యవసాయాదికారి జెడ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు పంట నష్టం సొమ్ములు వెంటనే అందించేలా కృషి చేస్తామన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించిన కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభిస్తామనిచెప్పారు. ప్రస్తుతం గోనె సంచుల సమస్య ఉందని, సంచుల కోసం రైతుల ముందుగానే వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎంవీ రమేష్, మండల వ్యవసాయాధికారి కే కుసుమ, పశువైద్యులు డాక్టర్ డీశంకర్, మాజీ సర్పంచ్ ముళ్లపూడి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

17న అలంపురానికి ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు: అలంపురం వెంకటరమణ ఛారిటీ ఆస్పత్రికి ఈనెల 17న ప్రత్యేక వైద్యులు రానున్నట్లు ట్రస్టు ప్రతినిధి కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి జీఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన ఎముకలు, కీళ్లు, చర్మవ్యాధులు, చెవి, ముక్కు, గొంతుపరీక్షలు, ఊపిరితిత్తుల వైద్యులు రానున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరీక్షలతో పాటు ఈసీజీ, 2డి ఈకో పరీక్షలు అవసరమైనవారికి చేయనున్నట్లు ఆయన తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువతకు స్ఫూర్తి అబ్దుల్ కలాం



నిట్‌లో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

తాడేపల్లిగూడెం: యువతకు స్ఫూర్తి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అని నిట్ రిజిస్ట్రార్ దినేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతరిక్ష, రక్షణ పరిశోధనా సంస్థల్లో శాస్త్రవేత్తగా భారతదేశానికి విశిష్ట సేవలను కలాం అందజేశారన్నారు. రాష్ట్రపతిగా దేశ పురోభివృద్ధికి పాటుపడి చిరస్మరణీయుడుగా కలాం నిలిచారన్నారు. ఎంతో మంది యువతలో చైతన్యం నింపిన మహనీయుడు ప్రజలు హృదయాలలో పదిలంగా ఉంటారన్నారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ టీబీ.వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కలాం సేవలు అమూల్యం

తాడేపల్లిగూడెం: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సేవలు అమూల్యమని మంగళవారం పట్టణంలోని ఆదికవి నన్నయ్య ప్రాంగణంలో జరిగిన కలాం జయంతి కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.అశోక్ కుమార్ అన్నారు. శాస్త్రవేత్తగా, మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొంది, ఇండియాను ప్రపంచపటంలో ఉంచారన్నారు. కష్టాలను ఓర్చుకుంటే ఉన్నత స్థానాలకు ఎగబాకుతారన్నది కలాం జీవితాన్ని చూసి నేర్చుకోవచ్చన్నారు. కలాంకు నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



నన్నయ్య ప్రాంగణంలో కలాం జయంతి



తణుకులో వైద్యులను సత్కరిస్తున్న దృశ్యం

దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం

తణుకు టౌన్: భారత దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు చెప్పారు. మంగళవారం అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా తణుకులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కలాంను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా ఇటీవల మృతి చెందిన పారిశ్రామికవేత్త రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పట్టణంలోని ప్రముఖ వైద్యులు టీఎస్ గుప్తా, డాక్టర్ వత్సవాయి వెంకటరాజు, వంక రామదాసు, బ్లడ్ బ్యాంక్ మేనేజర్ కారుమంచి యోహాన్‌లను సత్కరించారు. ఈకార్యక్రమంలో దేవిరెడ్డి అజయ్, మరపట్ల శాంతి, చదలవాడ మేఘన, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ స్పిరిట్ సేవలు అభినందనీయం



స్పిరిట్ అధ్వర్యంలో వైద్య శిబిరంలో అవగాహన

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ స్పిరిట్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. డాక్టర్ నార్ని భవాజీ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం కమల ఆసుపత్రిలో ఉచిత డయాబెటిక్ వైద్య శిబిరం జరిగింది. డయాబెటిస్ నిర్ధారణ స్క్రీనింగ్ టెస్టులు, ఫాస్టింగ్, పోస్ట్‌మీల్ పరీక్షలు, హెచ్‌బీ1సీ, యూరిక్‌యాసిడ్, నెర్వే కండక్టింగ్ పరీక్షలు తదితర 8 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అనంతరం నార్ని భవాజీతో పాటు డాక్టర్ చిట్యాల సురేంద్ర, డాక్టర్ పద్మిని, డాక్టర్ అఖిలలు మధుమేహానికి సంబంధించి గుండె, చర్మం, కంటి వ్యాధులు, తిమ్మిర్లు వంటి విషయాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, ఆహారపు అలవాట్లు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఉచిత మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ నార్ని నర్మదా, డాక్టర్ అఖిల, సభ్యులు చిన్నబాబు, సుందర్, వీర వెంకయ్య, బత్తుల ప్రసాద్, మల్లేశ్వరరావు, మహేష్, పాండురంగారావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు దండగర్ర విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైన దండగర్ర జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో తాడేపల్లిగూడెం మండలం దండగర్ర జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన బాల, బాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్. చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఏలూరు ఇండోర్ స్టేడియంలో అండర్–14 విభాగానికి జరిగిన పోటీల్లో ఈ విజయం సాధించినట్లు వివరించారు. బాలుర విభాగంలో పసుపులేటి రాజేష్, రాపాక వినయ్, బాలికల విభాగంలో అర్జుల మానస, కోట లక్ష్మిలు ఎంపికై న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారిని గ్రామ సర్పంచ్ పిల్లా రాంబాబు, హెచ్‌ఎం చంద్రశేఖర్, వ్యాయామోపాధ్యాయుడు బడుగు చంద్రశేఖర్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఎల్‌ఐసీలో మార్పులకు వ్యతిరేకంగా నిరసన



తణుకులో ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏజెంట్లు

తణుకు అర్బన్: సేవ్ ఎల్ఐసీ, సేవ్ పాలసీ హోల్డర్స్, సేవ్ ఏజెంట్స్ నినాదాలతో తణుకు ఎల్ఐసీ కార్యాయం వద్ద మంగళవారం ఏజెంట్లు తమ నిరసన తెలిపారు. అక్టోబరు 1వ తేదీ నుంచి ఎల్ఐసీలో చేసిన మార్పులను వ్యతిరేకిస్తూ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలు మంగళవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ఎల్ఐసీ ఏజెంట్లు వైవీ శ్రీనివాస్, సలాది ఉదయ భాస్కరరావు మాట్లాడుతూ ఏజెంట్స్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ పాలసీదారులకు నష్టం కలిగించే విధానాలతో కేంద్ర ప్రభుత్వం, ఐఆర్‌డీఏలు తీసుకువచ్చిన నూతన విధానాలను తిప్పికొట్టేందుకు ఎల్ఐసీ ఏజెంట్స్ అంతా కలిసికట్టుగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పాలసీదారులు, ఏజెంట్స్ ప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా ఉన్న నూతన విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సంస్థను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా 14 లక్షలకుపైగా ఉన్న ఏజెంట్స్ ఐక్యంగా ఉండి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని అన్నారు. పాలసీదారులకు బోనస్ పెంచాలని, పాలసీ ప్రీమియంలపై వేస్తున్న జీఎస్టీ తగ్గించాలని, పాలసీదారులు తీసుకుంటున్న లోన్‌లపై వడ్డీ తగ్గించాలన్నదే తమ పోరాటమని విజ్ఞప్తి చేశారు. ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ విద్యార్థుల దినోత్సవం



ప్రపంచ విద్యార్థుల దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం కై ండ్‌నెస్ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ గోయింకా ఉమన్స్ కళాశాలలో ప్రపంచ విద్యార్థుల దినోత్సవం జరిగింది. క్లబ్ అధ్యక్షుడు గట్టిం ప్రవీణ్ కృష్ణ, కార్యదర్శి పిళ్ళ వెంకన్నబాబు, డైరెక్టర్ కరిబండి రామకృష్ణలు మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలామ్ జీవిత విశేషాలను విద్యార్థులకు వెల్లడించారు. విద్యార్థులు కెరీర్‌లో కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రాముఖ్యతను చెప్పారు. ప్రిన్సిపాల్ గణపతిరాం, సభ్యులు టి.పాండురంగారావు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



అత్తిలిలో డ్రెయిన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్

అత్తిలి: మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అత్తిలి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు గ్రామ సర్పంచ్ గంటావిజేత నాగరాజు శంకుస్థాపన చేశారు. మంగళవారం అత్తిలి మట్టపర్తిగర్వులో రూ. 15లక్షలతో నిర్మించే అంతర్గత డ్రెయిన్‌లకు, బొంతువారిపాలెంలో రూ. 4.60లక్షలతో నిర్మించే మినీ గోగులం షెడ్డుకు సర్పంచ్ భూమి పూజ చేశారు. వరిఘేడులో రూ. 10లక్షలతో నిర్మించే సీసీ డ్రెయిన్, గుమ్మంపాడులో రూ. 10లక్షలతో నిర్మించే సీసీరోడ్డు, డ్రెయిన్‌లకు, బల్లిపాడులో రూ. 8.7 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్‌లకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, తెదేపా మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు పోలిశెట్టి చంటి, దాసం బాబ్జి, పార్టీనాయకులు కేతా సత్యనారాయణ, పూతినీడి శ్రీనివాస్, ఎంపీడీవో శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి



భవిత సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

ఇరగవరం: అభ్యసన సమస్య ఉన్న విద్యార్థులపై శ్రద్ధ వహించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని మండల విద్యాశాఖాధికారులు ఎస్ శ్రీనివాసరావు, జీబీవీ ప్రసాదరావు పేర్కొన్నారు. అభ్యసన సమస్యల పిల్లలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో 20శాతం విద్యార్థులు ఈ తరహా లోపం కలిగి ఉన్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి సరైన శిక్షణ ఇస్తే సాధారణ పిల్లలుగా మారతారని తెలిపారు. తల్లిదండ్రులు కూడా ఇంటి వద్ద పిల్లల విద్యపట్ల శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు ఎంటీ గాలేశ్వరరావు, వై జగదీష్, కేర్ టేకర్ ఎం రమావిజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శ్రద్ధ వహించాలి

అత్తిలి: ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా అభ్యసనా వైకల్యాన్ని నివారించవచ్చని ఎంఈవో ఎస్ రమేష్ అన్నారు. అత్తిలిలో సమగ్రశిక్ష భవిత పాఠశాలలో అభ్యసనా వైకల్యంపై ఈనెల 18 వరకు నిర్వహించే అవగాహన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ అభ్యసనా వైకల్యం వల్ల గణితంలో మాట్లాడటం, రాయడం, భాషా పరంగా ఇబ్బందులు ఉన్నాయన్నారు. వీటిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం శ్రద్ధ చూపడం ద్వారా నివారించవచ్చన్నారు. ఈసందర్భంగా విద్యార్థులతో ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో ఎంఈవో –2 ఎంవీఎల్‌కే ప్రసాద్, హెచ్‌ఎం టీఏ విజయకుమార్, ప్రత్యేక ఉపాధ్యాయులు కామన నాగరమ్య, జుత్తిగ ఏసురాజు, కొండ్రు మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఇరగవరం: విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



అత్తిలి: భవిత పాఠశాల విద్యార్థులచే ర్యాలీలో పాల్గొన్న ఎంఈవోలు

పిల్లల సామర్థ్యాలను పరిశీలించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): అభ్యాసన సమస్యల అవరోధాన్ని అధిగమించి పిల్లలను చదివిద్దామని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త సీహెచ్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పట్టణంలోని భవిత సెంటర్‌లో మంగళవారం అభ్యాసన సమస్యలు–అధిగమించడం ఎలా అనే అంశంపై దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తరగతి గదిలో ఉపాధ్యాయులు పిల్లలు సామర్థ్యాలను పరిశీలించి సమస్య లోపం ఉన్న పిల్లలను ప్రత్యేక శిక్షణ ద్వారా పిల్లల్లో అభివృద్ధి సాధించవచ్చునని చెప్పారు. సదుపాయాలను దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయుడు బాలీశ్వరయ్య, హెచ్‌ఎం బి.జ్యోతి, ఉపాధ్యాయిని కే.కుమారి, ఎస్‌కే మస్తాన్, చంద్రకుమారి, టీచర్ సత్యవతి, దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో ముగిసిన దుర్గమ్మ ఉత్సవాలు

పెంటపాడు: ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులోని కనకదుర్గమ్మ అమ్మవారి వార్షిక దసరా మహోత్సవాలు పురస్కరించుకొని మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్ బడేటి ఉదయభాను, కమిటీ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 8వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.